క్లుప్తంగా

ఏడీసీసీ బ్యాంకులో 'ఘర్ ఘర్ కేసీసీ అభియాన్'


ఖాతాదారులతో మాట్లాడుతున్న ఏజీఎం ప్రసన్న

గుత్తి: పట్టణంలోని ఏడీసీసీ బ్యాంకులో గురువారం ఘర్ ఘర్ కేసీసీ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మేనేజర్ మంజుల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏజీఎం ప్రసన్న హాజరై మాట్లాడారు. కిసాన్ క్రెడిట్ కార్డు లేని రైతులందరికీ తక్షణమే రుణ సాయం అందిస్తామన్నారు. రుణాలకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా బ్యాంకులో సంప్రదించాలని సూచించారు.

నేడు వాల్మీకి విగ్రహ ప్రతిష్ట

తాడిపత్రి: పట్టణంలోని యల్లనూరు రోడ్డు సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సీతా రామ సమేత వాల్మీకి విగ్రహ ప్రతిష్ట శుక్రవారం ఉదయం జరగనుంది. కార్యక్రమానికి తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డితో పాటు ఇతర నాయకులు హాజరుకానున్నట్లు వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు తెలిపారు.

గిరిజన రైతులకు పట్టాలిచ్చి హక్కు కల్పించండి


మంత్రి పెద్దిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: గుంతకల్లు నియోజకవర్గంలోని రామగిరి ఎగువతండా, పులగుట్టపల్లి తండాల్లో అటవీభూములను సాగుచేసుకుంటున్న గిరిజన రైతులకు పట్టాలిచ్చి ఆ భూమిపై వారికి హక్కు కల్పించాలని రాష్ట్ర గనులు, విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కోరారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలను గురువారం ఎమ్మెల్యే అనంతపురంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన సోదరుడు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఉన్నారు.

నేడు 'ప్రజావేదిక'

గుత్తి రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక(బహిరంగ సభ) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివాజీరెడ్డి, ఏపీఓ మద్దిలేటి గురువారం తెలిపారు. గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకూ జరిగిన ఉపాధి పనులపై తనిఖీ పూర్తయిందన్నారు. తనిఖీలో వెల్లడైన అంశాలను ప్రజావేదికలో బహిర్గతం చేస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని వారు కోరారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి


విద్యార్థినికి ప్యాడ్ అందిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ

శింగనమల: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ కోరారు. గురువారం ఆమె స్థానిక గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ప్యాడ్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల మందుల పంపిణీ


గొర్రెల మందులను పంపిణీ చేస్తున్న నగేష్

శింగనమల: వాటర్‌షెడ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వాటర్ షెడ్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నగేష్ రైతులను కోరారు. గురువారం వెస్ట్ నరసాపురం పంచాయతీలోని వాటర్‌షెడ్ కింద ప్రధాన మంత్రి క్రిష్ సంచాయి పథకం ద్వారా 40 మంది గొర్రెల కాపరులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యురాలు డాక్టర్ మోనోప్రియ, సర్పంచ్ వెంకటరాముడు, డీలరు మల్లికార్జునరెడ్డి, ఏఈ వెంకటనారాయణ, గంగాధర, గోపాలమిత్ర మునీంద్ర, బాలశ్రీనివాసులు, గొర్రెల కాపర్లు తదితరులు పాల్గొన్నారు.


శక్తి స్వరూపిణి.. వరప్రదాయిని!

సాక్షి నెట్‌వర్క్: దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లో పూజలు వైభవంగా జరిగాయి. గురువారం అమ్మవారి ఆలయాలను భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని పూజలు చేయించారు. అర్చకులు ఆలయాల్లో ఉదయం నుంచి పూజలు చేశారు. అనంతరం అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళహారతి ఇచ్చారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


గుత్తి రూరల్: సేవాగఢ్‌లో మహా చండీదేవిగా జగదాంబ


మహాలక్ష్మిఅలంకరణలో యాడికి పెద్దమ్మ తల్లి.


గుంతకల్లు:మహాలక్ష్మి అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మి


గుంతకల్లులో అన్నపూర్ణదేవిగా కన్యకాపరమేశ్వరి


గుత్తి: అన్నపూర్ణాదేవి రూపంలో సునామ జకినీ మాత


పెద్దవడుగూరు: క్రిష్టిపాడులో రాజరాజేశ్వరీగా చౌడేశ్వరి


శింగనమలలో శాకంబరి అలంకరణలో వాసవీమాత


గార్లదిన్నె మండలం కల్లూరులో అన్నపూర్ణదేవిగా వాసవీమాత


పామిడి: లలిత త్రిపుర సుందరి దేవిగా అంబాభవాని


తాడిపత్రిలో అన్నపూర్ణేశ్వరీదేవి అలంకారంలో వాసవీమాత


బీకేఎస్‌లో ప్రత్యేక అలంకరణలో కన్యకా పరమేశ్వరి


తాడిపత్రిలో పద్మావతీదేవి అలంకారంలో ఆనందవల్లి


తాడిపత్రిలో అన్నపూర్ణేశ్వరీదేవి అలంకారంలో అంబాభవాని


తాడిపత్రిలోని కటిక వీధిలో కొల్హాపురి మహాలక్ష్మిగా అంకాలమ్మ


తాడిపత్రి:యల్లనూరు రోడ్డులో మహాచండిగా చౌడేశ్వరీదేవి

రేకులకుంట ఉద్యాన శాస్త్రవేత్తగా దత్తారెడ్డి



బుక్కరాయసముద్రం: రేకులకుంటలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా కేంద్రం అల్ ఇండియన్ కోఆర్డినేటెట్ రీసెర్చ్ ప్రాజెక్ట్ ఆన్ ఫ్రూట్స్ శాస్త్రవేత్తగా గద్దె దత్తారెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పులివెందులలోని ఉద్యాన అరటి పరిశోధనా కేంద్రం నుంచి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా దత్తారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రైతులు సాగు చేస్తున్న దానిమ్మ, రేగు, ఉసిరి, మొదలకు పంటలపై పరిశోధనలు చేసి రైతులకు వివరిస్తామన్నారు.

నేడు 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి'పై సన్నాహక సమావేశం

తాడిపత్రి అర్బన్: రూరల్ పరిధిలోని ఏఎన్ఆర్ ఫంక్షన్ హాలులో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి అనే కార్యక్రమంపై సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హాజరుకానున్నారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

జనార్దన్‌రెడ్డికి నివాళి


జనార్దన్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

పుట్లూరు: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు భూమిరెడ్డి జనార్దన్‌రెడ్డి(50) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి గ్రామానికి చేరుకుని జనార్దన్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన

గుంతకల్లుటౌన్: పట్టణంలోని భాగ్యనగర్, బాయ్స్ హైస్కూల్ ఆవరణల్లో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయా వార్డుల ప్రజలకు వైద్యులు వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి మెడికల్ రిపోర్ట్, మందులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ స్వాతి, డాక్టర్ జ్యోత్స్న, కౌన్సిలర్లు మెహరున్నీసా, చాంద్‌బాషా, ఆర్‌ఓ నాసిర్, టీపీఎస్ అబ్దుల్‌సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: హుస్సేనాపురంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు లావణ్య, యశస్విని, ప్రభాకర్ నాయుడు 379 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారం స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రంగారావు, తహసీల్దార్ మునివేలు, సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి: చెట్నేపల్లి అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, వైస్ చైర్‌పర్సన్లు వరలక్ష్మి, పద్మలత కార్యక్రమాన్ని ప్రారంభించారు. మున్సిపాలిటీలోని 3వ సచివాలయ పరిధిలోని 5,6వ వార్డుల్లోని ప్రజలకు వైద్యులు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కౌన్సిలర్ అరవింద బాబు , సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

యాడికి: కమలపాడు గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు.


మెడికల్ రిపోర్ట్‌ను అందిస్తున్న కమిషనర్‌మల్లికార్జున


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రాయలచెరువు, యాడికి పీహెచ్‌సీ వైద్యాధికారులు అప్పయ్య, పరమేశ్వర్, అనంతపురం వైద్య నిపుణులు స్రవంతి, జాహ్నవి రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు. వైస్ ఎంపీపీ చెన్నప్ప, ఎంపీడీఓ లక్ష్మినారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి పాల్గొన్నారు.

యల్లనూరు: గొడ్డుమర్రి సచివాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష జరిగింది. వైద్యులు చరణ్, నితిన్, కీర్తన, లోకేష్ 420 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కంటి వైద్య నిపుణుడు గోపాల్ వృద్ధులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు ఈశ్వరరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ ఫిరోజ్‌ఖాన్, జిల్లా మలేరియా అధికారి ఓబులు, సూపర్‌వైజర్ రాము పాల్గొన్నారు.

శింగనమల: రాచేపల్లి సచివాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు శంకర్‌నాయక్, టిప్పు సుల్తాన్ దాదాపు 250 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ సునీత, ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఈఓఆర్‌డీ మురళీకృష్ణ, ఎంఈఓ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని ప్రాథమిక అర్బన్ హెల్త్ సెంటర్లో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. మున్సిపల్ కమిషనర్ జి.రవి శిబిరాన్ని పర్యవేక్షించారు. వైద్యులు రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు.

బుక్కరాయసముద్రం: సిద్దరాంపురంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు 506 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, మండల కన్వీనర్ అంకే నరేష్, సర్పంచ్ కొండన్న, తహసీల్దార్ రమాదేవి, తేజోత్స్న తదితరులు పాల్గొన్నారు.

పామిడి: పాళ్యంతండా గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి అనిల్‌కుమార్ డాక్టర్లు శివకార్తీక్‌రెడ్డి, సుధాకర్, అనిత, రఘునందన్ 402 మంది రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు. సర్పంచ్ వెంకటేష్‌నాయక్, మండల స్పెషలాఫీసర్ అప్పాజీరావు, ఈఓఆర్డీ బీవీ శశికళ పాల్గొన్నారు.

మిడుతూరులో చోరీ

పెద్దవడుగూరు : మిడుతూరు గ్రామంలో గురువారం ఓ ఇంటిలో చోరీ జరిగిన ఘటన వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన హరిత విజయవాడలో చదువుతున్న కుమార్తెలను పండుగకు పిలుచుకొచ్చేందుకు వెళ్లింది. ఇదే అదనుగా భావించిన దొంగలు బుధవారం రాత్రి ఇంటి తాళం కోసి బీరువాను మెండి అందులో ఉన్న ఒకటిన్నర తులం బంగారు, 12 తులాల వెండిని ఎత్తుకెళ్లారు. గురువారం చోరీ జరిగినట్లు గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి

యాడికి: పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివని వైఎస్సార్‌సీపీ మండలకన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, యాడికి సర్పంచు అనూరాధ అన్నారు. గురువారం సాయంత్రం పంచాయతీ కార్యాలయం వద్ద 40 మంది పారిశుధ్య కార్మికులకు దసరా సందర్భంగా దుస్తులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ ఎర్రిస్వామి, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


కార్మికులకు దుస్తులు, నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

శింగనమల: గార్లదిన్నె మండలం పెనకచెర్ల, యల్లనూరు మండలం బుక్కాపురం సచివాలయ పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు జరగనున్నాయి. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

తాడిపత్రిటౌన్: మండలంలోని బ్రాహ్మణపల్లిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రంగారావు తెలిపారు. గ్రామస్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇటుకలపల్లి సర్పంచ్‌కు గాయాలు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లి సర్పంచ్ భాస్కర్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. బుధవారం రాత్రి నగరం నుంచి ఇటుకలపల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎస్కేయూ సమీపంలో అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు గాయం కావడంతో నగరంలోని సవీరా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి గురువారం ఆస్పత్రికి వెళ్లి భాస్కర్‌రెడ్డిని పరామర్శించారు.

రైతులకు పంట నష్టపరిహారం అందించాలి

గార్లదిన్నె: తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం ఎగువపల్లిలో పంట పొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు సకాలంలో రాకపోవడంతో రైతులు సాగుచేసిన పత్తి, వేరుశనగ, ఆముదం, కంది, పెసర , అలసంద వంటి పంటలు ఎండిపోతున్నాయన్నారు. ప్రభుత్వం ఎకరాకు రూ.30 వేల చొప్పున నష్ట పరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శులు జాఫర్, వేమయ్య యాదవ్, జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి, నాయకుడు ఏకే నరసింహులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చెన్నప్ప యాదవ్, శర్మాస్ వలి, రాము తదితరులు పాల్గొన్నారు.


ఎగువపల్లిలో వేరుశనగ పొలాన్ని పరిశీలిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

గుత్తిరూరల్: గాజులపల్లి శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పామిడి మండలం రామరాజుపల్లికు వెళ్తున్న బైక్ గాజులపల్లి నుంచి వస్తున్న మరో బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో గాజులపల్లికి చెందిన బాలసుంకన్న, రామరాజుపల్లికి చెందిన రమేష్, రాకేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. వారిని చికిత్స స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు బాలసుంకన్నను కర్నూలుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

11 మంది టెక్ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

తాడిపత్రిటౌన్: పట్టణంలోని తాడిపత్రి ఇంజినీరింగ్ కళాశాల(టెక్)లో గురువారం చెన్నైకు చెందిన సాఫ్ట్‌వేర్ కంపెనీ లుమినోస్ సంస్థ క్యాంపస్ సెలెక్షన్స్ నిర్వహించింది. కంపెనీ ప్రతినిధులు కళాశాలకు చెందిన 11 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరికి ఏడాదికి రూ.3 లక్షల ప్యాకెజీ లభించనుందని కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిలో సీఎస్‌ఈ విభాగానికి చెందిన ఏడుగురు, ఈసీఈ విభాగానికి చెందిన ఇద్దరు విద్యార్థులున్నారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ సురేష్‌రెడ్డి అభినందించారు.

శ్రీవారి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు


శ్రీవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రాజేంద్రనగర్‌లో ఉన్న వేంకటేశ్వరస్వామిని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి దర్శించుకుని పూజలు నిర్వహించారు. గురువారం ఆలయంలో అన్నకూటోత్సవానికి ఆయన హాజరయ్యారు. అనంతరం ఆలయ వేదపండితులు ప్రసాదాలను అందజేసి శాలువా కప్పి ఆశీర్వచనం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్‌రంగయ్య, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల కోసం ప్రత్యేక ఆధార్ క్యాంప్


అప్‌డేటెడ్ ఆధార్‌కార్డు రశీదు అందజేస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: వేలిముద్రలు పడని పింఛన్‌దారుల కోసం గురువారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ప్రత్యేక ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేశారు. మరోసారి వేలిముద్రలను సేకరించి ఆధార్‌కార్డులకు మొబైల్ నెంబర్లను అనుసంధానం చేసిన అనంతరం అప్‌డేట్ చేసిన కార్డులను పింఛన్‌దారులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, మున్సిపల్ మాజీ చైర్మన్ రామలింగప్ప, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన నైరుతిరెడ్డి


సీఎం జగన్‌ను కలిసిన నైరుతిరెడ్డి

గుంతకల్లుటౌన్: జగనన్న చేదోడు ద్వారా లబ్ధిదారులకు ఆర్థికసాయం అందించడానికి గురువారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి కలిశారు. తన చిన్నాన్నలైన ఆదోని, మంత్రాలయం ఎమ్మెల్యేలు సాయిప్రసాద్‌రెడ్డి, బాలనాగిరెడ్డిలతో పాటు ఆమె సీఎం జగన్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. టీటీడీ పాలక మండలి సభ్యుడు వై.సీతారామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

గుంతకల్లు రూరల్: పులగుట్టపల్లి పెద్దతండా గ్రామానికి చెందిన స్వామి నాయక్ అనే వ్యక్తి గురువారం బైకుపై నాటుసారా తరలిస్తుండగా పట్టుకున్నట్లు సెబ్ సీఐ మహేష్‌కుమార్ తెలిపారు. నిందితుడి నుంచి 10 లీటర్ల నాటుసారా, బైకు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ట్రాన్స్‌కో డీఈఈగా మహబూబ్ బాషా


డీఈఈకి స్వాగతం పలుకుతున్న సిబ్బంది

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని 220 కేవీ సబ్‌స్టేషన్ డీఈఈగా మహబూబ్‌బాషా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అనంతపురంలోని 400 కేవీ కన్‌స్ట్రక్షన్ ఏఈగా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా మహబూబ్ బాషా మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా కృషి చేస్తామన్నారు. విద్యుత్ ఇంజినీర్లు నామాల రవీంద్ర, భీమేశ్వర ప్రసాద్, మస్తాన్ వలి డీఈఈకి శుభాకాంక్షలు తెలియజేశారు.